"వచ్చినవాళ్ళతో నువ్వే నన్ను మీ ఇంటికి ఆహ్వానించావని చెబుతాను. అప్పుడు నీ పరువు ఏమవుతుందో ఆలోచించు."

"సుధీర్... నన్నెందుకిలా చిత్రవధ చేస్తున్నావు? ఒక్కసారిగా నన్ను చంపెయ్యకూడదూ?" బాధగా అంది.

"చావడం కంటే ప్రేమించడం తేలిక కదూ! లతా... ప్లీజ్ లవ్ మీ!"

"ఐ హేట్ యూ... ఐ హేట్ యూ... ఐ హేట్ యూ!"

"నేను బ్రతిమాలేకొద్దీ రెచ్చిపోతున్నావు. నా బైక్‌లో ఏముందో తెలుసా... ఆసిడ్! మన లేబ్ నుంచి తెచ్చాను. ఏ అందం చూసి నువ్వు మిడిసిపడుతున్నావో ఆ అందం నీకు లేకుండా చేస్తాను."

అతని ముఖం క్రూరంగా మారడం చూసి భయపడిపోయింది లత. ఇంతలో లిఫ్ట్ ఆగింది. గేటు లాగి ఒక్క గెంతులో బయటకు వెళ్ళి "ఇంత క్రూరంగా ఆలోచిసూన్నావంటే యు ఆర్ నాట్ నార్మల్. ఐ విల్ టాక్ విత్ యువర్ పేరెంట్స్!" అంది.

"ఆ పని చేశావంటే నీకు పేరెంట్సే లేకుండా చేస్తాను!" అంటూ లిఫ్ట్ తలుపు మూసేశాడు.

ఇంటికొచ్చిన కూతురి ముఖంలో గాభరా చూసి కంగారుపడింది రమామణి.

"ఏమిటమ్మా ఏమైంది?" అంది. తల్లిని కౌగలించుకుని వెక్కివెక్కి ఏడవసాగింది లత.

"ఏమైంది తల్లీ?" రమామణి కంగారు ఎక్కువైంది.

తన బాధ తల్లికి చెప్పి ఆమెకు ఆందోళన కలిగించడం ఎందుకని అనిపించింది లతకు. కుర్చీలో కూర్చుని కన్నీళ్లు తుడుచుకుంటూ "నాకు మొన్న జరిగిన టెస్ట్‌లో తక్కువ మార్కులు వచ్చాయని మా లెక్చరర్ థియేటర్‌లో కనబడి చెప్పారు" అంది.

కూతురి మాటలు వన్ని రమామణి తేలిగ్గా నిట్టూరుస్తూ... "హమ్మయ్యా... దీనికా ఇంత ఏడుపు? పోనీలే- అది క్లాసుటేస్టేగా, పబ్లిక్ పరీక్ష కాదుగా! అయినా ప్రతి చిన్నవిషయానికీ ఇలా బెంబేలు పడితే ఎలా? భోంచేద్దువు పద... నాన్నగారు నీకోసమే ఎదురుచూస్తున్నారు" అంది.

లత తండ్రి వచ్చి "రారా భోంచేద్దాం. ఆకలిగా ఉంది" అంటూ ఆమె చెయ్యి పట్టుకుని వంటగదిలోకి పిలుచుకుని వెళ్లాడు.

తల్లిదండ్రుల అభిమానం చూస్తుంటే ఏడుపొచ్చింది లతకు. 'తనకేదైనా అయితే వీళ్ళు భరించగలరా? వీళ్ళకేదైనా అయితే తను భరించగలదా? భగవాన్... ఎందుకు నాకీ పరీక్ష? అందంగా ఉండడం తన తప్పా? మగవాడితో స్నేహంగా మాట్లాడడం కూడా తప్పా? ఎవరి జోలికీ పోకుండా తమ మానాన తాము బ్రతకడానికి కూడా వీలు లేదా?' అనుకుని బాధపడింది.

• • •

**కా**లేజీ నుంచి ఇంటికొచ్చిన సుధీర్‌కి తండ్రి ఎవరితోనో ఫోనులో మాట్లాడుతుండడం వినిపించింది.

"థాంక్యూ... రేపే చేరిపోతున్నాను అదే ఆఫీసులో! ఎంత... రెండులక్షల ఖర్చయింది. ఆరునెలలలో తిరిగి సంపాదించనూ..?! ఓ.కే... గుడ్‌నైట్!" అంటూ ఫోన్‌పెట్టి కొడుకు వైపు చూసి, "సుధీర్... త్వరగా రెడీ అవు. మనం హోటల్ కెళ్తున్నాం. మీకు పార్టీ ఇస్తున్నాను నేను" అన్నాడు రవీంద్ర.

